కథానిక:

# ముగ్గురు బిచ్చగాళ్లు

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

ఇరవై యేళ్ల క్రింద ఏదో ఊరు వెళ్లుతూ రైల్లో కూర్చున్నాను. రైలు బయలుదేరటానికి చాలా ఆలస్యం ఉంది. కిటికీ దగ్గర కూర్చున్నాను. మొదటి సారిఅదే నేను వాళ్లను చూడటం. వాళ్లు ముగ్గురు కుంటివాళ్లు. కాలి కుంటి కాదు, చేతి కుంటి. ఒకనికి ఎడమ చేయి లేదు. కడమ యిద్దరకు కుడిచేతులు లేవు. ముగ్గురూ చొక్కాలు తొడుక్కొన్నారు. ఆ చొక్కాలు కుట్టించడంలో సుష్ఠ యేమీ కలిసి రాలేదు. సామాన్యంగా బిచ్చగాళ్లు రైల్లో ఎక్కి అడుక్కుంటారు. రైళ్లల్లో వస్తారు. వాళ్లు ముగ్గురూ ఆ ప్లాట్‌ఫారం మీదనే అడుక్కొంటారు తప్ప రైలులో రారు సరిగదా రైలు పెట్టెలోకి గూడ ఎక్కరు.

ముగ్గురూ మంచి పొడగరులు. బలిష్ఠమైన దేహం గలవారు. ముగ్గురి ముఖాల్లోను మార్దవం గాని యాచ్ఞాదైన్యం గాని లేదు. పెట్టె దగ్గరకు వస్తారు. "అయ్యా! అవిటి వాళ్లం. ధర్మం చెయ్యండి". ఇంతే అడగటం. ఎవ్వరూ మాట్లాడక పోతే వెళ్లి పోతారు. సామాన్యంగా కుడిచేతి కుంటివాళ్లే అడుగుతారు. ఎడమచేతి కుంటివాడు మాట్లాడడు. మాటాడడంటే యాచన చెయ్యడు.

ఆ మొదటి సారి నేనూ వయసులో ఉన్నానేమో! పైగా క్రొత్తగా యింగ్లీషులో ఉత్తీర్ణుడనైన రోజు లేమో బిచ్చగాళ్లనే సంస్థ దేశాని కరిష్టమని, వాళ్లందరూ దొంగలని, యాచన అనేది దేశంలో ఉండకూడదని, యీ మొదలైన భావాలు నాకు అప్పుడున్నవి. నే నన్నానుగదా! "పిడిరాళ్లల్లే ఉన్నారు దొంగమా పని చేసికోలేరా?" అని. పని చేసుకుందామనే వాడికి పని దొరకటం కష్టమని ఆ రోజుల్లో నాకేం తెలుసు! నే నీమాట అనటంతోటే ఎడమ చేతి కుంటివానికి కోపం వచ్చింది. నావంక క్రోధంగా చూచాడు. రైల్లో తనాయించుకో పడుకొన్న కాబూలీ వాడి ముఖం ఎట్లా ఉంటుందో వాడి ముఖం అట్లా ఉంది. పక్కా రౌడీ మూల దైత్య జాతి వాడు, వాని మొగం వలె ఉంది. నే నంతటితో ఊరకొన్నా బాగుండేది. ఏం అట్లా చూస్తావని దర్జా పోయాను. వాడన్నాడు గదా: "పని చూపించు చేస్తాను. దొరవు వచ్చావు" అని. ఆ లెక్కలో నేను పైమాట యేమనను? హెచ్చితే తగ్గమన్నారు. అందులో నిజానికి ఆ ఊరు రౌడీ ఊరని ప్రశస్తి "దొంగలున్నారు జాగ్రత్త" అన్న ప్రకటనలు ఆ స్టేషనులో పదైనా ఉన్నవి. ఆ రోజులలో నా కనుమానంగా ఉండేది. ఇంతమంది పోలీసు లుంటే ఇంతమంది దొంగ లున్నారా? అని. పైగా వాని తరహా చూస్తే వాడు బిచ్చగాడల్లే లేడు. ఊరుకున్నాను. నేను పెంచలేదు గనుక వాడూ పెంచలేదు. వాళ్లు ముగ్గురూ వెళ్లి పోయినారు. కాని నాకు లోపల కోపంగా ఉందిగా! వాళ్లు వెళ్లుతూంటే వాళ్ల వంకే చూస్తున్నాను. కుడి చేయి కుంటివాళ్ల మందహాసం, వారి నడక ఎట్లా ఉన్నవంటే నే నొక యీగనో, దోమనో - వాళ్లు ఉరిమి చూచేటప్పటికి నా పైప్రాణాలు పైన పోయినవి - "హతోస్మి" అన్న శత్రువు వంక ధీరోద్ధతుడైన నాయకుడు ప్రదర్శించిన తిరస్కార సూచకంగా ఉన్నవి. ఎడమ చేతి కుంటివాడు నడిచాడు. శత్రు సైన్యాన్ని విదళించి సర్వనాశనం చేసిన మహాసేనాని వలె నడిచాడు. వాళ్ల శరీర చాలనమూ, వాళ్ల ముఖ లక్షణాలు, వాళ్ల నడకలూ చూస్తే వాళ్లు మహారాజులు, వాళ్లే ప్రభువులు.

తరువాత చాలా సార్లు వాళ్లను చూచాను. వాళ్లు మళ్లీ వచ్చి నన్నడగటం ఎప్పుడూ తటస్థించ

లేదు. అట్లా అడిగితే ఏదైనా యిచ్చేవాడిని కూడాను. నా మనస్సూ చాలా మారిపోయింది. బిచ్చగాళ్లేం చేస్తారు? వాళ్లకేం భూములా బుట్రలా? చదువులా ఉద్యోగాలా? వాళ్లను ప్రత్యేకంగా పోషించేందుకు రాజకీయసంస్థ లేమైనా ఉన్నవా? అది యొక వృత్తి యెందుకు కాగూడదు? ఏ పాపం చెయ్య నక్కరలేని, చెయ్యటానికి వీలులేని ఆ వృత్తే మంచిదేమో! అందులో దైన్యం ఉందంటారు. యాచ్నావృత్తికి దైన్యానికి నిత్యసంబంధం. అధికారంతోడి యాచ్నావృత్తి వెగటువేస్తుంది. లోకానికి ఉపద్రవం తెస్తుంది. దైన్యంతో కూడిఉన్న యాచ్నావృత్తి స్వభావసిద్ధమైంది. దానివల్ల ఎవరికీ బాధ లేదు. యాచించే వాడి ఆత్మ సాధువైనా కావచ్చు.

నే నెంత మారితే నేమి! వాళ్లు మారలేదు. నేను వాళ్లకి గుర్తే. పదేండ్లు గడచినవి. వాళ్లు నావంక నే చూడరు. వాళ్ల ప్రభుత్వం మాత్రం అవ్యవహితంగా సాగుతూ నే ఉన్నది. దూరాన్నుంచి చాలా సార్లు వాళ్ల రాచరికం చూచాను. వాళ్లు ఓడిపోవటం నేను చూడలేదు. భగవంతుడు వాళ్ల యందున్నాడనిపించింది.

వీళ్లెవరు? వీళ్ల చరిత్ర యేమిటి? కనుక్కుందామని పుట్టింది నాకు. కాని వాళ్లతో మాట్లాడటం ఎల్లాగా? వాళ్లు ప్రభువులాయె! ఒకరోజున నా అంతట నేనే వెళ్లి వాళ్లకి అణా యిచ్చాను. ఇచ్చానన్న కృతజ్ఞత లేదు. ఒక మెప్పుదల లేదు. ఇవ్వకేం చేస్తా డన్నట్టుగా ఊరకొన్నారు. ఇంతకూ ఆ ఊరు మా ఊరు గాదు. ఏదో పనిమీద నే నా ఊరు అనేక సార్లు వెళ్లక తప్పదు. ఎప్పుడు వెళ్లినా ప్రొద్దున వెళ్లటం సాయంత్రం తిరిగి రావటం. ఒకసారి ఆ ఊళ్లో నాలుగు రోజు లుండవలసి వచ్చింది. పని కాలేదు. రేపు ప్రొద్దున, ఆ సాయత్రం ఇట్లా ఉన్నాను. ఒకనాడు సాయంత్రం పని యేమీ లేదు గనుక వాళ్లను గురించి వాకబు చెయ్యటం పని పెట్టుకొన్నాను. అబ్బాయి, మీ రెక్కడ ఉంటారు? అని అడిగాను. వాళ్లు నావంక ఒక విచిత్రంగా చూచి తమ దారిని తాము వెళ్లారు. అది వెన్నెల రాత్రి.

నేను సినిమాకు వెళ్లి పదిగంటలవేళ తిరిగి వస్తున్నాను. రోడ్డు బాగు చేస్తూంటే ప్రక్క సందులో నుండి పోదామని మళ్లాను. ఆ సందు నిర్జనంగా ఉంది కాని కొంత దూరం వెళ్లేటప్పటికి కొంచెం దూరంలో ముందుగా నలుగు రైదుగురు మనుష్యులు కన్పించారు. వాళ్ల తరహా చూస్తే దెబ్బలాట జరిగి సర్దుకున్నట్లు తోచింది. అక్కడ సందు మలుపు తిరిగింది. సందులో నడిమి భాగంలో యీ కథ. సందు మొదట ఒక రక్షకభటుడు కన్పించాడు. అత డెందుకు జోక్యం కల్పించుకో లేదు? అనిపించింది. కాని వెంటనే సమాధానం తోచింది. ఎవరన్నా పోయి అతనితో ఫిర్యాదు చేస్తే గదా! ఫిర్యాదు లేకుండా రాచరికం జోక్యం కల్పించుకోదు. నాకు కొంచెం భయం వేసింది ఈ అపరాత్రి వేళ యీ సందులోకి వచ్చామేమా! అని. కాని మొండిధైర్యంతో ముందుకు నడిచాను. మరీ యేమైనా జరిగితే రక్షకభటునితో పోయి చెప్పవచ్చునని. నే నందాక వెళ్లేటప్పటికి వాకిట్లో ఉన్న యిద్దరు ముగ్గురు మనుష్యులూ లోపలికి వెళ్లారు. లోపలి నుంచి ఒక క్రొత్త మనిషి వచ్చి వాకిట్లో నిలుచున్నాడు. బాగా దగ్గరకు వెళ్లేటప్పటికి ఆ మనిషి యెవ్వరో నాకు తెలిసింది. ఆ ముగ్గురు బిచ్చగాళ్లల్లో ఒకడు. కుడిచేతి కుంటివాళ్లల్లో ఒకడు. వాళ్లతో నాకు పదేళ్లకు మించిన పరిచయ మాయెను. వాళ్లతో మాట్లాడవలెనని కోరికాయెను. నా దారిని నేను మాట్లాకుండా పోదా మనుకొన్నవాణ్ణి అతనిని పలుకరించాను "నీ విక్కడుంటావా?" అని. అతడు "ఊఁ" అన్నాడు. అది పెద్ద అనుగ్రహం. ఊఁ అన్నాడే గాని ఎక్కువ మాటాడిస్తే మాటాడే ధోరణిలో లేడు. నేనూ మర్యాదగా వెళ్లిపోయాను.

మరునాడు రాత్రి పని పెట్టుకొని మళ్ళీ అక్కడకు వెళ్లాను. సందులో ఎవ్వరూ లేరు. సందు మొదట రక్షకభటుడు లేడు. ఆ తలుపుమాత్రం తెరచి ఉంది. సాహసించి లోపలికి పోనా వద్దా? తటపటాయిస్తూ సందుచివరదాకా వెళ్లినవాడిని జారుని వలె వెనుకకు తిరిగివచ్చాడు. నేను వెనుకకు తిరిగిరావటం అతడు కనిపెట్టాడు కాబోలు బయటకువచ్చి "ఏమిటి నాతో పని?" అన్నాడు.

నే నేమి చెప్పను? నేను చెప్పిన మాటల్లో నిజమతని కేం తెలుస్తుంది? అయినా చెప్పక యేం చెయ్యాలి? అయినా చెప్పక తప్పదు. "అబ్బాయీ! నేను కవిని. నాటకాలు, నవలలు, కథలు వ్రాస్తూ ఉంటాను. మిమ్మల్ని పన్నెండు పదుమూడేండ్ల

నుంచి చూస్తున్నాను. మీవంటివాళ్ల కథలు మేము వ్రాస్తే మేము చాలా గొప్పవాళ్లమని దేశం అనుకొంటారు. నీసంగతి కనుక్కుందామని వచ్చాను" అని చెప్పాను. అతడు నా మాటలు నమ్మినట్లుంది గాని తెలియనట్లు లేదు. అతడా వెన్నెలలోనే నావంక తీక్ష్ణంగా చూచాడు. ఒక నిముషం అయిన తర్వాత "రేపు రాత్రికి రా" అన్నాడు. రండీ లేదు పాడూ లేదు. ఏం అత అమర్యాదగా మాట్లాడుతానని వాడితో తగాదా పెట్టుకోనా! పైగా అతనికోసం నేను వెళ్లాను తప్ప నాకోసం అతడు రాలేదు గద. నేను అతణ్ణి 'నువ్వు' అంటే అతడు నన్ను 'ఏమండీ' అని యెందుకనాలి? మనుష్యులలో ఎక్కువ తక్కువ లేమున్నవి? అనే భావం మల్లించుకొని నాదారిని నేను వచ్చేశాను. కాని నేను కొంత దూరం నడిచిన తర్వాత నావెంట యెవరో వస్తున్నట్లుగా అలికిడి తోచింది. ఆమనిషి కొంతదూరంలో నాపోయినంత మేరా వచ్చాడు. నేను బసదగ్గర నిలబడ్డాను. అతడు తనదారిని తాను పోయినట్లుగా నాముందరగానే నడచివెళ్లాడు. ఇదేమిరా క్రొత్తతద్దినం కొని తెచ్చి పెట్టికొన్నాననిపించింది. కొంతసేపు నిద్ర పట్టలేదు.

మరునాడు రెండుమూడు విచిత్రములైన అనుభవాలు జరిగినవి. ఒకళ్లిద్దరు నావంక పరకాయించి చూడటం. ఆరోజున సాయంత్రం ఆఊళ్లో పఠనాలయంలో నేను కూర్చొని ఒకళ్లిద్దరు స్నేహితులతో మాట్లాడుతూంటే ఒక బిచ్చగాడల్లే కనపడేవాడు నా ఆచోకీ కనుక్కోటానికి ప్రయత్నిస్తున్నట్లుగా తోచింది. ఆసమయంలో ఆ స్నేహితు లిద్దరు నేను వ్రాసిన ఒక కథ చాలాబాగుందని మెచ్చుకొంటున్నారు. మరీ అదృష్టం—అని తర్వాత తెలిసింది - ఆ కథ బిచ్చగాళ్లను గురించి వ్రాసిందే.

రాత్రికి అతనిదగ్గరకు వెళ్లాలా? అక్కరలేదా? ఒక భయం లోపల ఉన్నది. ఆభయం ఇదమిత్థమని చెప్పలేను. ఒక ధైర్యం ఉన్నది. వాడేమో బిచ్చగాడాయెను. వానినిగురించి యింత తర్జనభర్జన యెందుకని అనుకొంటాను. చివరకు వెళ్లాను. కడచిన రెండు రోజులు ఆవాకిటిముందర గలీజుగా ఉంది. నేను వెళ్లేటప్పటికి ఊడిచి నీళ్లు చల్లినట్లుంది. నేను ద్వారంలో నుంచున్నాను. కడచిన రెండురాత్రులుగా లేని దీపం ఒకటిలోపల వెలుగుతున్నది. ఒక చాప వేసిఉన్నది అతడు లోపల కూర్చుండి 'రండి' అన్నాడు. అంతమట్టుకు నయమే 'రా' పోయి 'రండి' అయింది. వెళ్లాను కూర్చున్నాను. "నీ పేరేమిటి?" 'బుంగన్న' "నీకు సంసారం లేదా?" "ఇదే సంసారం". "రోజుకేమాత్రం సంపాదిస్తావు?" "సంపాద నేమున్నదండి బాబూ! మీవంటి దొరలు 'పనిచేసుకోరాదా? అంటారు' కాని తోచినప్పుడణాలిస్తారు గదా?" అతడు నవ్వాడు. అతనికి చమత్కారం కూడా తెలుసు. మళ్ళీ నేనన్నాను. "మొన్న ఇక్కడేదో అల్లరిగా ఉందేమిటి?". అతడు సమాధానం చెప్పాడు. "మీరు నిజంగా కథలు వ్రాసేవాళ్లే. కనుక్కున్నాను." "నేనూ అనుమానపడ్డాను. ఎందుకు నామీద రహస్యభటులను ప్రయోగించావు?" "మామీద రహస్యభటులుంటారు మీరందులో ఒకళ్లేమోనని అనుమానంతో" "ఛీ! ఛీ! నేనదేమీ కాదు. నిజంగా మీసంగతి కనుక్కుందామనే అడిగాను. పూర్వం నాకు బిచ్చగాళ్లంటే చాలా అసహ్యంగా ఉండేది. ఏకలెక్టరో అవుతానని అనుకునేవాణ్ణి. అది అనుకుంటూ కారణం: ఇప్పుడదేమీ కానని తెలిసింది. బిచ్చగాళ్లంటే నాకేమీ ద్వేషం లేదు. పైగా మిమ్మల్ని గురించి కథలూ అవీ వ్రాసి తృణమో పణమో సంపాదించుకొంటూన్నాను."

అతను నవ్వుతూ "మాపేరు చెప్పి సంపాదించుకొంటారు గాని మాకేమీ యివ్వ"రన్నాడు. "ఈసారి వచ్చే డబ్బులో కొంత నీకిస్తాను" అని అన్నాను. అతడు ఉదారంగా "అక్కరలేదులెండి. మీరూ పేదవాళ్లే అయి ఉంటారు. నాది ఒక్క పొట్ట. తేలిగ్గా రోజుకి నాలుగైదు రూపాయలు అన్ని మినహాయింపులూ పోను నావాటా వస్తుంది" అన్నాడు.

నేను - 'మినహాయింపులేమిటి? అతడు - చాలా ఉంది లెండి'. నేను-దానికోసమేగా నేను వచ్చింది. అతడు- నేనన్నీ చెప్పటానికి వీలు లేదు. మానాయకుణ్ణి కనుక్కొంటే నేగాని చెప్పటానికి వీల్లేదు. నేను-మరి యెప్పుడు రమ్మంటావు? అతడు-పదిరోజులు పోయిన తర్వాత రండి. నేను-మీ నాయకుడంటే యెవరు? ఆ యెడమచేతి కుంటివాడా? అతడు-ఔనన్నాడు. నేనన్నానుగదా "ఆసంగతి తర్వాత చెప్పవచ్చు—నీ పూర్వచరిత్ర చెప్పవచ్చుగదా" అన్నాను. అతడు- అదీ అప్పుడే చెప్పుతాను. నాయకుడి అనుమతి

లేకుండా అదీ చెప్పకూడదు. నేను మీపక్షం మాట్లాడి అతడిని ఒప్పిస్తాను. మీరు నిజంగా వట్టి కవేనా? నేను-ఒట్టు. కావలిస్తే చేతిలో చేయి వేస్తాను. అతడు-"ఎడమచేయి పనికి వస్తుందా?" అని నవ్వాడు. నా కాశ్చర్యం వేసింది. అతని చమత్కారం, అతని హాస్యం, అతని నాగరికత. అతడు బిచ్చగాడేమిటి?

మరునాడు రైల్వేస్టేషనులో మళ్ళీ ముగ్గురూ కన్పించారు. ఆ నాయకుడు నావంక చురుకుగా నిదానంగా చూచాడు. ఎదటివాని సర్వమూ ఆకట్టేందుకు ఒక మహామంత్రి అట్లా చూస్తాడేమో? ఒక మహానాయకుడు అట్లా చూస్తాడేమో?

౨

పదిరోజులైన తర్వాత వెళ్లాను. రైలుదగ్గరే వాళ్లు కన్పడ్డారు. కాని వాళ్లు ముందు ఎక్కడో ఉన్నారు. 'రాత్రికి రావచ్చునా?' అని అడగటానికి ఎట్లా వీలు? తీరా రాత్రికి వెళ్లితే మర్నాడు రమ్మంటాడేమో? ఇంకో రోజు కూడా ఆ ఊళ్లోనే ఉండవలసివస్తుంది.

అది వెన్నెలరాత్రి కాదు. ఆ సందు భద్రమైన సందూ కాదు. సరే! సినిమా ఉందికదా తోడు. రాత్రి పదింటికి వెళ్లాను. మళ్లీ సందు మొదట రక్షకభటుడు. అతని ఇంటిముందు నలుగు రైదుగురు మనుష్యులు. క్రొత్తమనిషి వస్తున్నాడని వాళ్లు ఆకట్టారు. ఈసారి చీకటియొక్క ఆసరా చూచుకొని కాబోలు లోపలికి పోలేదు. నే నింతమంది ఉండగా మాట్లాడటం ఎందుకని వెళ్లిపోదా మనుకొన్నాను. ఆ మనుష్యు లెట్లాంటి మనుష్యులో నాకు తెలియదు. నే నొంటరిగా నున్నాకదా అని వాళ్లు నామీద ఏదైనా అత్యాచారం చేయవస్తే ఏం చేయాలి? అతని పేరు నాకు తెలుసును. అందుచేత ఒక చిన్న ప్రయోగం చేశాను. అక్కడికి వెళ్లి నిలుచుని 'బుంగన్న ఉన్నాడా?' అని అడిగాను. వాళ్లు నలుగురూ నావంక చిత్రచిత్రంగా చూచారు. చీకట్లో చూచారనటం ఎట్లా? మరి చూడలేదనటం ఎట్లా? చూచారన్నది స్ఫురిస్తున్నది ప్రత్యక్షంగా వాళ్ళ కళ్ళ కాంతులు కన్పించకపోయినా.

వాళ్లు మాట్లాడలేదు. నేను వెళ్లిపోతున్నా. ఆ పేరు మోహనమంత్రంగా నన్ను వాళ్లు వెళ్లనిచ్చారనిపించింది. నేను సందుమలుపు తిరిగిన తర్వాత ఒక మనిషి వచ్చి బుంగన్న 'నిన్ను రమ్మంటున్నా' డన్నాడు. నేను వెనక్కి తిరిగి వెళ్లాను. నేను వెళ్లేసరికి అక్కడ ఒక్క మనిషీ లేదు. ఇంతట్లో నలుగురూ ఏమైనారు? సందుయొక్క ఆచివర రక్షకభటుడు కాబోలు నిలుచున్నాడు. నేను లోపలికి వెళ్లాను. బుంగన్న రమ్మన్నాడు. చాప వేశాడు. దీపం వెలిగించాడు. చాప వేస్తూ అన్నాడుగదా 'మీరు వస్తారని తెలియదు' అని. "ఇందాక మీరు దూరంగా కన్పించారయ్యా! చెపుదా మంటే అందలేదు" అన్నాను. అతడు-"ఎప్పుడూ నాతో ముందర చెప్పి రావాలి. లేకపోతే ఏవళ్లో ఒకళ్లంటారు." "ఎవళ్లు వాళ్లు?" అన్న ప్రశ్న నోటిదాకా వచ్చింది. అడుగవచ్చునో అడుగరాదో? ఆ ప్రశ్న ఆపుకొని "మీ నాయకుణ్ణి అడిగావా?" అన్నాను. బుంగన్న-అడిగాను కాని మీరు వ్రాసేది మాకు వినిపించి పత్రికల్లో వేయించాలి. ఊళ్లపేర్లుండకూడదు. మాపేర్లుండకూడదు. నేను-కథకు ప్రాణం పేర్లేనయ్యా! అతడు-పేర్లు మారిస్తే? నేను-కథ కథగా ఉంటుంది. గుర్తుపట్టలేరు. అతడు-కథనుబట్టి గుర్తుపట్టలేరా? నేను-పాండవులూ ద్రౌపదీ అజ్ఞాతవాసంలో పేర్లు మార్చుకొన్నారు. ఇంచుమించుగా కథకథగానే చెప్పారు. ఏం గుర్తుపట్టారు? అతను నవ్వాడు. ఎందుకు నవ్వుతున్నా వన్నాను. 'మమ్మల్ని ఏంగుర్తుపట్టారు? అల్లాగే' అన్నాడు. నేను-మీ రెవ్వరో తెలియదాయె ఎట్లా గుర్తుపట్టడం? అతడు-అదికాదు బాబూ! సరే కాని మా నాయకుడు మీతో నాకథ చెప్పవచ్చన్నాడు. నేను-నాకు నీ ఒక్క కథే కాదు మీ ముగ్గురి కథా కావాలి అన్నాను. అతడు-"మా నాయకుడు మొదట ఒప్పుకోలేదు. నేను ఒప్పించాను. సింగన్నా! ఇందులో ఏమే ముందన్నాను. అత డన్నాడు గదా పోనీలే పదిరాళ్లు తెచ్చుకొని బ్రతుకుతున్నాడు కాబో లన్నాడు."

నాకు కష్టం వేసింది. అరే, వీళ్లకు దయనీయుణ్ణి అయినానే నేను అని. మరి అన్నాను "అతని పేరు సింగన్నా?" అని. అతడు— "నాకథ చెప్పమంటారా?" అని వెంటనే కథ చెప్పటం ఆరంభించాడు.

"నేను, సింగన్నా ఒకే జాతివాళ్లం. ఎప్పుడో మావాళ్లు దూరదేశం వలసపోయారు. కాని

వాళ్లూ మేమూ సంబంధాలు త్రెంచుకోలేదు. ఆవలస దేశంలో మా వాళ్లు చాలా సంపాదించారు—అని బుంగన్న చాలా పెద్దపెద్ద పేర్లు చెప్పాడు—నేన ట్లాంటి కులంలో పుట్టాను. కాని నా జాతకం యిలా ఉంది. నేనూ చిన్నప్పుడు చదువుకొన్నాను. అల్లరి చిల్లరిగా తిరిగాను. బోలెడంత డబ్బుంది. నాకు చదువెందుకు? పైగా మా వాళ్లల్లో చాలామంది చదివారు. పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తున్నారు. కాని నేను చాలా ఘోరాలు చేశాను. అవన్నీ యిప్పుడెందుకు? అయిదారుసార్లు ఖైదులోకి వెళ్లవలసివచ్చింది. డబ్బు సమృద్ధిగా ఉందిగనుక ఖైదుతప్పిపోయింది. ఇదంతా నాకు ఇరవైయేళ్లు రాకముందే. ఆపాటున ఉండిపోతే బాగానే ఉండేది. కాని మనస్సు నిలవలేదు. దేశం చూడాలనిపించింది. చాలాచోట్లు తిరిగాను. ఒకసారి రైల్లో వెళ్లుతూంటే ఆ రైలుకు ప్రమాదం సంభవించింది. ఆ ప్రమాదంలో నా కుడిచేయి విరిగిపోయింది. అదేదో ఆసుపత్రిలో ఉన్నాను. నెల్లాళ్లు నా స్మృతి నాకు తెలియదు. నేనెవరో నాకు గుర్తు తెలియదు. ఒకయేడాది బిచ్చగాళ్ళల్లో చేరాను. తర్వాత స్మృతివచ్చింది. మా ఊరు వెళ్లాను. ఆక్కడ మా ఆస్తి అంతా పోయింది. చాప చెద్దా దదరంత కాదా! అక్కడుంటే కూటికీ గుడ్డకీ లోపం లేకుండా జరిగేదే. కాని బిచ్చమెత్తటం సుఖమనిపించింది."

నేను-"ఇది ఆశ్చర్యంగా ఉంది. బిచ్చమెత్తట మేమిటి? సుఖ మేమిటి?" అతడు—"ఆసంగతి మీకు తెలియదులే బాబూ! ఇందులో చాలా సుఖమున్నది. చీకూ చింతా లేదు. ఒకణ్ణి లెక్క పెట్టవలసిన అవసరం లేదు." నేను-"అట్లా అంటా వేమిటి బుంగన్నా! గడపగడపా యెక్కాలి. దేబిరించాలి. వాళ్లు విసిరికొట్టే పడిఉండాలి. ఒక్కొక్కప్పుడు తిట్టారు. మళ్లీ తిట్టటానికి కూడా వీల్లేదు." అతడు- "ఇదంతా సుఖం కాదంటారా? ఒక్క విషయం ఆలోచించండి ఓట్లకోసం తిరిగే మీ నాయకు లందరూ ఏం చేస్తున్నారు? దానికీ దీనికీ యేమైనా భేదం ఉందా? ఆలోచించండి."

నేను నిస్తబ్ధుడ నైనాను. నా కేమీ సమాధానం కనిపించలేదు. అతను మళ్లా అందుకొన్నాడు "బాబూ! సుఖ మనేది అప్పుడుగాదు అది అయిన తర్వాత. గృహస్థు విసుక్కున్నా, విదళించినా, తిట్టినా, ఆసమయంలో అత డెంత గొప్పవా డనుకొంటాడో బిచ్చగాడూ అంతగొప్పవాణ్ణి అనే అనుకొంటాడు. పెయ్యిమందిలో ఒకడుంది యిస్తేచాలు. అదంతా యెందుకు? దేశంలో యింతమంది బిచ్చ మెత్తుతున్నారు. ఎవళ్ల దగ్గరకైనా సరే పోయి ఒకేయేమాయింట్లో పనిచేసేందుకు ఉంచుపుగానిరా. అన్నం పెట్టి నెలకు పాతిక రూపాయ లిస్తానని ఒప్పించు. ఒక్కడు ఒప్పుకోడు. వాడు బిచ్చమెత్తుతూ బిచ్చమెత్తుతున్నాననే అనుకోడు. ప్రతివాడు తనపని తను చేస్తూ అదిగొప్పగానే ఉందనుకొంటాడు గాని కొద్దిగా ఉందనుకోడు. ఇప్పుడు ఓట్లు అడిగేవాళ్ళని చూడండి. ఛీ! వీళ్లని పోయి అడగటం ఏమిట్రా? అని అనుకొంటారా? తరువాత రాజ్యం చేయవచ్చు అనే ధిలాసాలో ఆ నీచత్వం కన్పించదు. పైగా ఆ ఉద్దేశ్యంతో ఉన్నప్పుడు ఇది కూడా మర్యాదగల పనే అవుతుంది."

నే నన్నాను—"తరువాత వాళ్లు నిజంగా రాజ్యం చేస్తున్నారు. మీ రేం చేస్తున్నారు?"

అతడు—"వాళ్లు రాజ్యం చేస్తున్నారని అంటారా? నా కేమి నష్టం? ఇంటికి వచ్చినతర్వాత మమ్మల్ని అడిగేవాడు లేడు. మాయిష్టంవచ్చినట్లుండగలం. మాకు బాదరబందీ లేమీ లేవు. వాళ్ళకట్లా కాదుగదా!"

"అవును లేవోయి బుంగన్నా! అంతా మనస్సులో ఉంది. ఏది బాగుందనుకొంటే అదే బాగుంటుంది. మరి వాళ్ళకేం బోలెడంత సంపాదిస్తారు. చేతిలోఅధికారం ఉన్నది. వాళ్లే యిష్టం వచ్చినవాళ్ళకి మేలు చేస్తారు. ఇష్టంలేనివాళ్లని అణగత్రొక్కుతారు."

బుంగన్న—"కొద్దిలో ప్రపంచకం రహస్యం అంతా చెప్పారు" నేను అతని తెలివితేటలకాశ్చర్యంపోయాను. "ఇతను బిచ్చగా డేమిటి" అనుకొన్నాను. అయినా అతడు పూర్వం మంచిరోజులు తెలిసినవాడు. లోకానుభవం గలవాడు. అందరు బిచ్చగాళ్లూ ఇలా ఉంటారా? మళ్లీ ప్రశ్న వేశాను. "లోకమంతా అంతే నండాం. అది వాళ్లకున్నది, మీకు లేదుకదా?" అని. బుంగన్న అన్నాడు గదా "ఏమిటి మాకు డబ్బు లేదనా? మాకు డబ్బున్నది. లేదనుకోటం పొరపాటు. మీలో యెన్ని భేదా

లున్నవో మాలో అన్నిభేదా లున్నవి. బిచ్చగాళ్లలో తిండికి లేనివా ళ్లున్నారు. మీలోనూ తిండికి లేనివా ళ్లున్నారు. మాలో ధనవంతు లున్నారు. మీలో ధనవంతులున్నారు. మీ దొక ప్రపంచకం మాదొక ప్రపంచకం. మిమ్మల్నిగురించి మాకు తెలుసు. మమ్మల్ని గురించి మీకు తెలియదు."

కథ అవసాన మైపోయి యింక వెళ్లిపోవాల్సిందే అనుకొన్నాను. కాని వెళ్లటాని కిష్టం లేదు. ఇక యేదో తెలుసుకోవాలని మళ్లీ ప్రశ్నించాను "నీ దగ్గర యేమాత్రం డబ్బున్నది?" బుంగన్న—"నాకు డబ్బెందుకు? కావలిస్తే నాకు లోపం లేదు. వెనుకటి దఫా చెప్పాగదా! అన్ని మినహాయింపులూ పోతే రోజు కారు రూపాయ లన్నా నాకు మిగులుతా యని. మిగులుతవి అంటే అందులో దమ్మిడీ నేను ముట్టుకోనక్కరలేదు. సంవత్సరానికి రెండు వేలు నాది నికరాదాయం. నీవు నమ్మవేమోగాని నాసొంతడబ్బు పాతిక వేలుంది. దాంతో నాకేం గావాలి! ఎప్పుడో ఒకప్పుడు సంఘాని కుపయోగపడేదే."

నాకు మళ్లీ రెండుప్రశ్నలు దొరికినవి. మినహాయింపు లేమిటి? సంఘం ఏమిటి? అతను మొదటి ప్రశ్న కిలా సమాధానం చెప్పాడు "ఇది నీతో చెప్ప వచ్చునో చెప్పకూడదో! నాకు తెలియదు. చెప్పానని తెలిస్తే సింగన్న యేమంటాడో తెలియదు. బిచ్చగాడు ఎవడైనాసరే సంఘానికి తహాస్సీలు కట్టాలి, కొందరికి జబ్బుచేస్తే పోషించాలి. మాలో కొందరు ఖైదులోకి వెళ్తూఉంటారు. వాళ్ల కుటుంబాల్ని పోషించాలి. అధికార్లకి మామూళ్లుంటవి. రక్షకభటులకు మామూళ్లుంటవి. ఇందులో ఎవడికో పెళ్లి అయితే వాడిఖర్చు సాగించాలి. ఇల్లా చాలా పను లుంటవి. ప్రతివాడూ తన సంపాదనలో ఆరోభాగం నీట్క్రింద యివ్వాలి. తక్కిందే వా డుపయోగించుకోవాలి."

నేను—"మీదంతా చూస్తే ఓపెద్ద సంస్థవలె ఉంది. మరికొందరు బిచ్చగాళ్లు చాలా యిబ్బంది పడుతూఉంటారే?"

బుంగన్న — "ఎవళ్లు ఇబ్బందిపడతారు? సంఘంలో చేరనివా ళ్లిబ్బందిపడతారు. మీలోనే చూడండి. ఒక పార్టీవాళ్లు రాజ్యం చేస్తుంటే ఆపార్టీవాళ్ల కేమి యిబ్బంది ఉంది? ఆపార్టీలో చేరనివాళ్ల కిబ్బంది. కొంత రెక్కువ సంపాదిస్తా మనుకొని మాలో చేరరు. వాళ్ల కష్టాలు వాళ్లనుభవిస్తుంటారు.

నేను— ఈడబ్బంతా యెవళ్లు వసూలు చేస్తుంటారు?

బుంగన్న— మాలో అధికారు లున్నారు. ఇందాక మీరు వచ్చినప్పు డిక్కడ నలుగు రున్నారు గదా. వెనుకటి దఫా మొదటిసారి వచ్చినప్పుడు కొంద రున్నారు. వీళ్లందరూ డబ్బు వసూలు చేసేవాళ్లే. ఇందులో కొందరు కొంత డబ్బు మింగేస్తుంటారు. వాళ్లను శిక్షించటం మొదలైన పను లుంటవి. ఇదంతా ఒక రాజ్యం"

నేను— "నీవు పెద్ద ఉద్యోగస్థుడ వన్న మాట."

బుంగన్న— "నేనూ— రంగన్న. రంగన్న అంటే మాలో మూడోవాడు. మేమిద్దరం మంత్రులం. సింగన్న రాజు. సింగన్న యీ మూడు జిల్లాలకూ రాజు. ఈ మూడు జిల్లాలూ ఒక పరగణా. ఈ జిల్లా మీద సింగన్న తానే సొంతంగా చూచుకొంటాడు. నేను రంగన్న మరిరెండు జిల్లాలు చూస్తాం."

నేను— "మరి ప్రపంచకంలో యీమూడు జిల్లాలేనా ఉన్నవి?"

బుంగన్న— అన్ని జిల్లాలకూ అధికారు లున్నారు. అన్ని పరగణాల అధికారులూ ఏడాది కొకసారి రెండేళ్ల కొకసారి కలుసుకొంటారు. మాది న్యాయమైన రాజ్యం. అన్యాయమూ లెక్కువ చెయ్యం. మాకు సేన లక్కరలేదు. తుపాకు లక్కర లేదు. మాది ఒక శాంతిరాజ్యం.

నేను— "బుంగన్నా! నాకు నవ్వు వస్తోంది. లోకమంతా మీరే యేలుతున్నట్లు మాట్లాడుతున్నావు. మా మంత్రులు, మా రాష్ట్రప్రజలు, మా శాసనసభ్యులు, మా సేనాపతులు, వీళ్లందరి మాట యేమి చెప్పావు?"

బుంగన్న కథ మార్చాడు. ఇల్లా అన్నాడు: "ఇంతకూ మీ కథకు తగినంత విషయం దొరికింది కదా! మీరు కథ వ్రాసుకోండి. ఇంక మాగోల మీ కెందుకు?"

నేను—"నన్ను తీసికుపోయి నట్టేట్లో దిగవిడుస్తున్నావు. సరిగా తెలుసికోవలసిన విషయం దగ్గరకు వచ్చేటప్పటికి ముగించి వెళ్లమంటున్నావు

నాకథకి ముక్కు, మొగం ఏర్పడ్డది. కాళ్లు తెలియటం లేదు. ఎట్లా నడవాలో తెలియదు."

బుంగన్న — "మా రంగన్నకీసంగతి బాగా తెలుసు. అతను బాగా చదువుకొన్నవాడు. అతనిని పోయి కలుసుకొంటే మీరు మీ కథ యెట్లా నడపాలో చెప్తాడు. అతడు పెద్దకవి. మా బిచ్చగాళ్లు పాడే పాటల్లో సగం పాటలు అతడు వ్రాసినవే. అతను బాగా పాడుతాడు. కిన్నెరమీద అతను వాయిస్తూఉంటే సభ సభంతా విస్తుపోయి చూస్తుంటూరు."

నేను — "నేను రే పుండడానికి వీల్లేదు. మళ్లీ యెప్పుడైనా వస్తాను. నన్నతనిదగ్గరకు తీసికొనివెళ్లతావా?"

బుంగన్న — "ఇంకా నాలుగు రోజుల్లో శివరాత్రి వస్తోంది. ప్రతి శివరాత్రినాడు అతడా కాలువఉందే-ఆ కాలువప్రక్కన గుడిసెలు లేవా? అక్కడ కూర్చుని పాడుతాడు. ఆరోజున రా."

## 3

ఆ సంగతి నేను మరచిపోయినాను. శివరాత్రి నాడు ఆఊరికే వెళ్ళేవాణ్ని కాదు. సాయంత్రపు పూట ఒక స్నేహితుడు తనపని యేదో చూచిపెట్టమని ఆఊరికి తరిమాడు. ఆ పనిలోఉండి నేనీ విషయమే మరచిపోయినాను. రాత్రి పది అయింది. చీకటి. ఇంకా చంద్రోదయం కాలేదు. అయ్యో లక్షణాలు తూర్పున కన్పిస్తున్నవి. నేను రోడ్డువెంట ప్రాఙ్ముఖంగా నడుస్తుంటే సన్నని తెల్లని కాంతులు, చల్లని మెల్లని గాడ్పులు, సన్నని ప్రసన్నని మధురసంగీత నినాదాలు, ఒక్కసారి వచ్చి నన్ను కొట్టినవి. ఒక్కసారి మనస్సులో సర్వమూ ప్రకాశించింది. ఈ మనస్సులోది ప్రకాశం. వెంటనే ఒక్క వంద విషయాలు హఠాత్తుగా స్ఫురిస్తవి. అందుకనే ఒకదశలో మనస్సే బ్రహ్మ అని తెలుసుకోవాలన్నాడు. ఈ సంగీతం ఎక్కడిది? కాలువ ఒడ్డునుంచి వస్తున్నది రంగన్న సంగీతం పాడుతున్నాడని వెంటనే తెలిసింది. కొంత దగ్గరకు పోయినాను. కొన్నివందల మంది అతని చుట్టూ కూర్చుని యున్నారు. అనేక మంది రోడ్డుమీదనే నిలచిపోయిఉంటున్నారు. ఒకతను నాతో అన్నాడు. "అతను కుంటివాడండి


FREE

**NO LICENCE NEEDED**



**American Model**

REVOLVER

మీ ప్రాణము, ఆస్తి, మానము, దుండగీడులనుండి, క్రూరజంతువులనుండి కాపాడుకొండి.

ఇంటివద్ద, పిక్నిక్‌లో, ప్రయాణంలో ఈ రివాల్వరు మీకు ప్రాణస్నేహితుడు, అసలు అమెరికన్ పిస్టల్‌వలె, ఆరుగుళ్లు వరుసగా ప్రేలునట్లు అమర్చియున్నది. అది 15 ఔ॥ బరువు, 9 అం॥ పొడవుగలిగి ప్రేల్చగానే గొప్పశబ్దముతో, అగ్నికణములు వెదజల్లును. వెంటనే ఒకదానికి ఆర్డరు ఇవ్వండి. ఖర్చులేని యీ అంగరక్షకుని యేమారవద్దు.

తోటాలతో ఖరీదు:—

| | | | |
|---|---|---|---|
| రకం నం. | 222 | 333 | 444 |
| రు. రు. | 6-8-0 | 7-8-0 | 8-8-0 |

ప్రత్యేకం 4 డ. తోటాలు రు. 4-8-0.
పిస్టల్ కేసుతో తోలుబెల్టు ఒకటి రు. 5/-
ఇందుకు చమురు రూ. 1/-

ఈ పిస్టల్సు మార్కెటులో వ్యాప్తిపరచటానికి అందానికి గట్టిదనానికి 12 సం॥లు గ్యారంటీగల ఒక రిస్టువాచీని ప్రతి పిస్టలుతో ఉచితంగా యివ్వటానికి నిశ్చయించాము. ఒకేసారి రెండుపిస్టల్సుకు ఆర్డరిస్తే పోస్టేజి ప్యాకింగు ఉచితము.

**American Pistol Co.,**

Putlighar - Amritsar.

కుడిచేయి లేదు. మెడ క్రిందపెట్టి కుడికాలితో కిన్నెర ఆడుసుతాడు, ఎడమచేతితో తంత్రులు మీటుతాడు. ఈ కుడికాలి బొటనవ్రేలితో కంజిరా మ్రోగిస్తాడు" అని.

కంచికామాక్షిమీద పాడుతున్నాడు ఒకకీర్తన. దాని మాధుర్యం ఆ స్వరసమ్మేళన చెప్పటాని కలవి కాదు. ఇప్పుడు ప్రసక్తి కాదు.

రాత్రి పదకొండు దాటిపోయింది. ఎవరి దారిని వాళ్లు వెళ్ళిపోయినారు. నేనక్కడే నిలుచున్నాను. రంగన్నయిలెక్కడ? రాత్రి పన్నెండయినతర్వాత రంగన్న ఒక్కడూ బయలుదేరి పోతున్నాడు. నేనతనివెంటనే వెళ్లాను. అతని యిల్లు చేరేవరకు నేనతనివెంట వెళ్ళుతున్నానని అతనికి తెలియదు. తీరా యింటిముంగిట నన్ను చూచాడు. ఎవరో అనుకున్నాడు. అనుకోటంలో అనుమానపడ్డాడు. మళ్లీ తిరిగిచూచాడు. "నేనే నయ్యా!" అన్నాను. లోపలికి పోయి కూర్చున్నాం: "రంగన్నా! నీవు మనుష్యుడవు కావు. అవతార పురుషుడవు. ఆ సంగీత మేమిటి! నీగొంతు మాధుర్య మేమిటి! నీ వాద్య మేమిటి! నీ పాదాలకి నమస్కారంచేస్తే పాపాలు పోతవి" అన్నాను. అతను అయ్యయ్యో అదేమిటి బాబూ! ఎంతమాటెంతమాట. ఏదో చిన్నప్పుడు నేర్చుకున్నాను. అరవదేశంలో చాలా రోజులు తిరిగాను. కుడిచేయి లేదుగనుక ఎడమచేతితోనే అలవాటు చేసికొన్నాను. మీరు గొప్పవారట. కవులట. సంగీతంపాడితే నేనవతారపురుషుడనయితే కవిత్వంవ్రాస్తే మీరూఅవతార పురుషులే గదా" అన్నాడు. మాటకీ మనస్సుకూ ఉన్న సంబంధమే అతిచమత్కారంగా ఉంటుంది. అతను ఆమాట అనటంతోటే నేను సంగీతలోకంలోంచి బయటకు వచ్చాను. అక్కడికి నేనెందుకు వచ్చానో స్మృతికి వచ్చింది. అతను వెంటనే అన్నాడు "మీకు నాసంగతి చెప్పాలి గదా! మీకు ప్రొద్దు పోతుందేమో? మాకేముంది ఎన్ని రాత్రిళ్లయినా మేల్కొనిఉంటాం. ఈసంగీత మండీ బాబూ అనేక రకాలు. మా బిచ్చగాళ్ల సంగీతాలు వేరు. మీబాణీ వేరు. మాబాణీలలో ఉన్న తీపి కచ్చేరీలు చేసేవాళ్ల బాణీలలో ఉండదు. దాని కాలోచన యెక్కువ కావాలి. శాస్త్రం యెక్కువ తెలిసిఉండాలి. మాబాణీలో పాటయొక్క ఫణితి, కంఠమాధుర్యం ప్రధానంగా ఉంటవి. సామాన్యజనం దీనికి చప్పున లొంగిపోతారు. మాది యీదేశం కాదు; పడమటిదేశం. మావాళ్లెప్పుడో వచ్చారు. నా తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోయారు. బుంగన్నవలె నేను గొప్పయింట పుట్టలేదు. సింగన్నవలె పుట్టానని చెప్పుకోను. ఇప్పటికీ నాకు కొద్దిగా జ్ఞాపకమే. మిఠాయిదుకాణాలప్రక్కన నిలుచుండి కొనుక్కొని తినేవాళ్లదగ్గర చేయిచాపే వాణ్ణి. కొందరు పెట్టేవాళ్లు. కొందరు కన్నెఱ్ఱజేసే వాళ్లు. అప్పుడప్పుడు దెబ్బలు కూడా తగిలేవి. బాబూ! అంతా చిత్రమే. అట్లాంటి నేను ఎట్లా బ్రతికానో నాకే ఆశ్చర్యంగా ఉంటుంది. నాచేత దొంగతనాలు చేయించటానికి కొందరు ప్రయత్నించారు. నేను లొంగలేదు. పెద్దనైన తర్వాత తెలిసింది. లోకమంతా దొంగతనమే నని.

నేను—"అయితే దొంగతనం చెయ్యవచ్చునన్నమాట. ఇప్పుడు చేస్తున్నావా?" అతను-"చేయకపోతే రాజ్యం చేయటం ఎట్లా? బాబూ! రాజ్యం చేసేవాడంటే మొదట బిచ్చగాడు, తరువాత దొంగ." నేను-"నీవు రాజు నంటావా యేమిటి?" అతను— "రాజైతే రెండుచేతులూ ఉండాలా? రెండుచేతులతోనూ పోసుచేసేది ఒక్కచేతితో యెందుకు చేయరాదు? చేతనై యుండాలిగాని. నాకు పదహారు పదిహేడేళ్లు వచ్చేవరకు ఏంజరిగిందో? ఎట్లా బ్రతికానో! పూసగ్రుచ్చినట్లు చెప్పలేను. కొన్నాళ్లు కూలికి వెళ్లాను. గోడలు కట్టేవాళ్లతో చిన్నచిన్న పనులకూ తిరిగాను. అదేమీ గిట్టింపు కాలేదు. ఎప్పుడు కూలి లేకపోతే అప్పుడు బిచ్చమెత్తుతూ ఉండేవాణ్ణి. ఒక యేడాది కాబోలు పంగనామాలు పెట్టుకొని రామదాసుకీర్తనలు పాడుతూ తిరిగాను. ఆ యేడాది చాలా బాగుంది. నాగొంతు బాగా ఉండటంమూలంగా నేనెక్కడికి వెళ్లినా గుప్పెడు వడ్లకు బదులు దోసెడు వడ్లే వచ్చేవి. ఆరోజులు వేరులే బాబూ! దేశంలో గింజ ఉండేది. కనపడేది. ఒక పల్లెటూళ్లో కుప్పలు కొట్టే రోజులు. పదికళ్లాల దగ్గరకు వెళ్లాను. ఆపూటకి తూమెడు వడ్లు సంపాదించాను. కానీ పెట్టే ఆపూటకు కావలపిన ఉప్పూ, మెరపకాయ, చింతపండూ అన్నీ ఇచ్చేవాడు కోమటి. ఇప్పుడు బియ్యమే కనపడవు. ఇంతలో ఒకఅరవబిచ్చ

గాడికి నాకూ స్నేహ మైంది. వాడితో దక్షిణాది అంతా తిరిగివచ్చాను. ఆ దేవాలయాలు చూడని బ్రతుకెందుకు బాబూ! బలే కట్టించారు ఆ పూర్వపు రాజులు. ఆ అరవవాడూ చాలామంచివాడే. వాడు పలకకపోయినా పలకరించి మాట లనాలనిపించుతుంది.అంత మంచివాడు. తిరిగేకాలు తిట్టే నోరు ఊరకోదని, మే మొకచోట వుండలేము. నీ బుద్ధి కర్మను అనుసరించి వుంటుందని అంటారు. మళ్లీ తెలుగుదేశం వచ్చాను. ఆ పడమటి ఊళ్లు వెళ్లాను. అక్కడ పదేళ్ల పిల్లల్ని 'వాన' అంటే ఏమిటంటే వాళ్లకి తెలియదు. ఈ మాగాని ఊళ్లల్లో బియ్యం తినటానికి అలవాటుపడ్డ ప్రాణానికి జొన్నకూడు గతకలేదు. ఇక ఆ దేశం వదలిపెట్టి వద్దామనుకొంటుంటే రైలువాళ్లు రానివ్వలేదు. రైలెక్కటంతోటే వాళ్లు వచ్చి దింపేసేవాళ్లు. పోలీసు వాళ్లు కొట్టేవాళ్లు. పోలీసువాళ్లమీద బలే కచ్చ పుట్టింది. వీళ్లపని పట్టా లనిపించింది. నేను.'ఇప్పుడు పట్టించావా?" అతడు—"పట్టించావా? అని అడుగుతున్నావా? ఇప్పుడు నేను చెప్పినట్లు వినాలసిందే. అది తర్వాత మాట. ఆ స్టేషన్లో ఎక్కితే ఈస్టేషన్లో దించారు. అక్కడ యెక్కితే యింకోచోట దించారు. ఎల్లా అయితేనేం మనదేశానికి తోలుకొని వచ్చాను.

ఇంకో ఏడాది ఒక మహారాజింట్లో ఉన్నాను. ఆయనయింట్లో పనీ పాట చేస్తుండేవాణ్ణి. ఆయన పెద్ద పండితుడు. భారత భాగవతాలు వాళ్ళింట్లో చదివాను. బుద్ధులు భూము లేలుతుంటే కర్మం గాడిదల్ని కాస్తోం దంటారు. అక్కడుండకూడదూ! కాశీకి పోవాలని బయలుదేరాను. ఒకరోజు రాత్రి అదేదో ఊరు వెళ్లాం. నడిరాత్రివేళ. రాత్రి రెండుగంట లవుతుంది. బిచ్చ మెత్తటం అలవా టైందిగా; ఆ ఊరొక తీర్థం. మరునాడు పరవడి. ఏటిదగ్గరకు పోయి గుడ్డ పరచి ఒకపుల్ల గుచ్చి వద్దామని బయలుదేరాను. వాళ్లబాస మనకు తెలియదు. బజారువెంట ఎవళ్లూ లేరు. ఒకఆడది. వంటినిండా పదివేల రూపాయల నగలుంటవి, గజ్జలగుఱ్ఱంవలె నడచి వస్తోంది. ఆ చీకట్లో మెరసిపోతోంది. ఆవెనుక చీకట్లో ఒకడు పట్టాకత్తి చేత్తో పుచ్చుకొని నడచివస్తున్నాడు. నేను వాణ్ణి చూడలేదు. నా కప్పుడు ముప్పై యేళ్లుంటవి. నా దారిని నేను పోగూడదూ, నిలచి ఆడదానివంక చూచాను. ఆవిడ బండీకి కట్టిన గుఱ్ఱం బెదరినట్టుగా రోడ్డుప్రక్కకి లాగింది. నిజానికి నే నేమీ అనలేదు. ఇంతలో ఆవెనుక నున్నవాడు వచ్చి పట్టాకత్తితో నాచేయి నరికాడు. నేను కేక అయినా వేయలేదు. పడిపోయినాను.

తరువాత పదిరోజులకు ఆస్పత్రిలో నాకు మెలకువ వచ్చింది. తరవాత నెల్లాళ్లకు విడుదల చేశారు. అవిటివాణ్ణి అవటం బిచ్చానికి ఎక్కువ వీలిచ్చింది. నేను సంగీతం పాడి సంపాదించుకోగలను. భారత భాగవతాల్లో పద్యాలు చదివి సంపాదించుకోగలను. మొదటినుంచీ బిచ్చమంటే నాకు అసహ్యం. కుంటివాణ్ణి అని చెప్పుకొని అడుక్కోటం మరీ నాకు డోకు వేసింది. ఒక రోజున ఒక ఊళ్ళో బిచ్చగాళ్ల సావిట్లో పడుకొన్నాను. ఇవ్వాల్టికి మల్లే నే రాత్రి ప్రొద్దు పోయేదాక పాడాను. ఒక బిచ్చగాడికి నామీద ఎంతో గౌరవం పుట్టింది. ఆత డన్నాడు గదా "రంగన్నా! నీవు సంఘంలో చేరరాదా?" అని. అతడే, నాకు సంఘం వాకబంతా చెప్పింది. చేరాను. కాని మన సంపాదనంతా మనది కాదు. మినహాయింపులు పోతవి. మొదట బాగుండలేదు. తరువాత తరువాత తెలిసింది. సంఘంలో చేరటంతోటే బిచ్చగాణ్ణిఅవటం మానేశాను. క్రమక్రమంగా గొప్పదశకు వచ్చాను.

నేను— "ఇప్పుడూ బిచ్చగాడివే కదా?" అతడు— "బిచ్చగాడని వీ రనుకొంటారు." నేను —"మరి యెవ్వరు నువ్వు?" అతడు— "మానాయకుడి అనుజ్ఞ లేకుండా చెప్పకూడ దనుకో, నేను స్వతంత్రంగా ఉంటానని నామీద గుఱ్ఱు వీళ్లకి. నిజం చెప్పేసెయ్యాలి; తప్పు దాచుకొని కూర్చుంటే యేముంది?" నేను— "అయితే నిజ మేమిటో చెప్పు." అతడు— "నేను చెపుతా ననుకో తెలుసుకోవటం కష్టం. ఒక సంసారం ఉందనుకో. బాబూ! పెళ్లాం ఎంత చెప్పితే అంత. పైకి భర్త సంపాదిస్తున్నట్లు నిర్వాకం చేస్తున్నట్లు కన్పిస్తుంది. అసలు రాణి ఆవిడ. ఇంతకూ నీవు మాకథ వ్రాస్తా నంటివిగా వ్రాసి మాకు చూపించు. మా పేర్లు పెట్టకూడదు. ఊరి పేర్లు వ్రాయగూడదు. నీవు కథ యెట్లా మొదలెట్టావో. ఎట్లా ముగిస్తావో? కథ యెందుకో ఒకం

దుకు చెప్పాలిగా, అదెందుకో తెలిసేటట్లుగా వ్రాయాలి. ఏది యెక్కువ చెప్పగూడదో, ఎక్కడ ఎక్కువ చెప్పాలో ఇదంతా చాలా ఉన్నది. ఇంతకూ మాకథ వ్రాయటానికి అప్పుడే వీల్లేదు. మానాయకుడితో మాట్లాడితే గాని వ్రాయటానికి వీల్లేదు. చాలా రహస్యా లున్నవి. అవి చెప్పచ్చు నంటాడో చెప్పకూడదంటాడో! ఇంతకూ మానాయకుడికి పైవాళ్లున్నారు. హిమాలయందగ్గరనుంచీ రామేశ్వరందాకా మా సంఘా లున్నవి. అందరూ తలా ఒకచోట తలా ఒక నాయకుడు. చక్రవర్తి ఉన్నాడు. ఆయన్ని కనుక్కోవాలి. మళ్ళీ రా! ప్రొద్దు పోయింది."

## ౪

తరవాత నా సంసారంలో చాలా మార్పులు జరిగినవి. అనేక ఆపదలు వచ్చినవి. పదేళ్లు గడచినవి. ఈపదేళ్ళలో నేనా ఊరు కూడా చాలాసార్లు వెళ్లలేదు. ఒకసారిదూరాన్నుంచి చూచాను. ముగ్గురూ మాత్రం ఉన్నారుగాని వాళ్లు ముగ్గురూ మునుపటి ముగ్గురు కాదు. బుంగన్న బుంగన్నే. రంగన్న మారి పోయినాడు. రంగన్న బదులు ఇంకెవరో వచ్చారు. మొత్తాన వాడికీ కుడిచేయి లేదు.

మళ్లీ ఒకసారి చూచాను. మళ్లీ యేదో మార్పున్నది. నాకు చాలా చమత్కారం వేసింది - మనుష్యులు మారినా ముగ్గురి సంఖ్య మారటంలేదని.

ఒకసారి దగ్గరగా చూచాను. నాతోపాటు వాళ్ళకీ యేళ్లు వస్తున్నవి. వాళ్లల్లో యేమీ మార్పు కన్పడలేదు. వాళ్లు నవయౌవనులులాగానే ఉన్నారు. వాళ్ళ శీవి కేమీ తరుగు రాలేదు.

మళ్లీ కొన్నాళ్లకు చూచాను. అది చివరిసారి చూడటం. చివరిసారి అంటే మళ్లీ నాకథ అందుకొనేసారిలో అన్న మాట. ఇప్పుడు ముగ్గురు గాదు నలుగు రున్నారు. యుద్ధాలు రెండూ అయిపోయినవి. ఇది కొద్దిరోజుల క్రిందటి మాట.

నేను రైల్లో కూర్చున్నాను. నలుగురూ కిటికీ దగ్గర నిలుచున్నారు. నాలుగోవాడికి కొంచెం గడ్డం ఉంది. పూర్వం బుంగన్న కూడా చేయిచాచేవాడు. ఇప్పుడు బుంగన్న దూరంగా నిలుచున్నాడు. ఈగడ్డం వాడు దూరంగా నిలుచున్నాడు. నిలుచోలేదు. వాడిముఖం చూస్తే కొంచెం భయంకరంగా ఉంది. ఏదో చాలా హత్యలు చేసి వీళ్ళతోపాటు గొప్పవాడు అయినవాడల్లే ఉన్నాడు.

నేను సాంకేతికంగా బుంగన్నతో మాట్లాడాను. నా యెదురుగుండా ఒక స్నేహితుడు కూర్చున్నాడు. అదివర కేదో ప్రసంగాన్ని అనుసరిస్తున్నట్లుగా స్నేహితుడితో అన్నాను. "ఈమధ్య చాలా చిక్కులు వచ్చినవి. పదేళ్లపైన గడిచింది. కథ అల్లాగే ఉండిపోయింది. ఇవ్వాళరాత్రికి వెళ్లుదామనుకొంటున్నాను" అని బుంగన్న వంక చూచాను. బుంగన్న కన్ను సరే అన్నట్లుగా ఉంది.

టిక్కెట్టు కొన్నవాణ్ణి వాపసు ఇచ్చి ఉండిపోయినాను.

రాత్రి పదింటికి బుంగన్న ఉండే చోటుకి వెళ్లాను. తలుపు వేసిఉన్నది. తలుపు తట్టాను. ఇంట్లోంచి ఆడవాళ్లు ఎవరో వచ్చి 'రండి' అన్నారు. తరహా చూస్తే నాకు వెగటు వేసింది. వద్దులే అని వెనక్కి తిరిగివచ్చాను. మరి బుంగన్న ఎక్కడున్నాడు? మరునాడు మళ్లీ స్టేషన్‌లో కనిపించాడు. ఇంకో మార్గం కనిపించలేదు. సాయంత్రం దాకా అటూ ఇటూ తిరిగి ప్రొద్దుగ్రుంకినతర్వాత బుంగన్న వెంటనే వెళ్లాను. ఇప్పుడు బుంగన్న ఉంటున్న యిల్లు చిన్నగది కాదు. పెద్ద యిల్లు. జనం వస్తున్నారు పోతున్నారు.

నేను వెళ్లటంతోటే బుంగన్న "వస్తున్నాను కూర్చోండి" అని గంటసేపటికి వచ్చాడు. వచ్చి "యిప్పటికి తీరిక అయింది. యిప్పుడు నేను చక్రవర్తిని. రాజ్యంఅంతా చక్కదిద్దుకొనేటప్పటికి కష్టం అయిపోతోంది" అన్నాడు. నాకా రోజున సింగన్న చెప్పిన కథ జ్ఞాపకం వచ్చింది. బుంగన్న మళ్లీ అన్నాడు. "ఇన్నేళ్లకు వచ్చారేమి? వచ్చినా మంచిదే. ఇప్పుడు మా సంగతంతా మీతో చెప్పవచ్చు. నన్నడిగేవా డెవ్వడూ లేడు. కాని ఒక్క సంగతి. మన మన స్నేహం ఇరవై యేళ్లది. నేను చెప్పే మాటలు అందరికీ తెలియకుండాఉండటం మంచిది. తెలియజేస్తే ఒడుపుగా తెలియజేయాలి. అందరికీ తెలిసిన విషయాలే ననుకోండి. మీ సంసారాల్లో మీ రాజ్యాలల్లో అందరికీ తెలిసిన విషయాలే గోప్యంగా ఉంచుకొంటారు. అందరకూ తెలుసు. ఎవళ్లకి వాళ్లు

చెప్పుకొంటూనే ఉంటారు. సభలలో బహిరంగంగా మాత్రం అనకూడదు. అది మీ మర్యాద. మాది యింకా గోప్యం. రాజుగా రొకదానిని ఉంచుకొన్నా డనుకోండి; ఆయన యెదుట రాణీగారనే అంటాం. బయటకువచ్చి ఉంచుకొన్నది అంటాం. మాస్థితి దీని కెదురు. నిజానికి రాణీగారు చెప్పవలసివస్తే ఉంచుకొన్నదని. రాణీగారని అందరికీ తెలుసు. అల్లాగా మేము పైకి బిచ్చగాళ్లం. అందరూ బిచ్చగాళ్లనే అంటారు. మేము ప్రభువులమని అందరికీ తెలుసు. నేను—"నాకు తెలియదే?" బుంగన్న— "మీకు తెలియకపోతే తప్పు నాది కాదు. దాచటం ఎందుకు? అసలు రహస్యం చెపుతాను. మీ మంత్రులు, రక్షకభటులు, ఉద్యోగస్థులు రాజ్యం చేస్తున్నారని మీ రనుకొంటారు. నిజంగా రాజ్యంచేసేది మేము. పెద్ద ఉద్యమాలు లేవదీసేది మేము. దొంగతనాలు, శిక్షలూ అన్నీ వేయించేది మేము." నేను—"నా కర్థం కావటంలేదు." బుంగన్న—"మీ రక్షకభటులందరూ మాచేతుల్లో ఉన్నారు. మీ ఉద్యోగస్థులందరూ మాచేతుల్లో ఉన్నారు. మేము వాళ్లకు మామూళ్లు ఇస్తాము. మే మెల్లా చెప్పితే వాళ్లట్లా నడవాలసిందే. మాకు సంబంధంలేని దొంగతనా లైతే మీ న్యాయస్థానాలలో విచారణలూ, శిక్షలూ జరుగుతవి. మా సంబంధం ఉంటే జరుగవు. ఆ శిక్షలు మేమే వెయ్యాలి. మమ్మల్ని మించిన అధికారం లేదు."

నా తలంతా తిరిగిపోతోంది. అతడు చెప్పే మాటల్లో లీలగా నిజం ఉన్న ట్లేదో అనిపిస్తోంది, విస్పష్టంగా భాసించటంలేదు. బుంగన్న మళ్లీ అన్నాడు—"ఈమధ్య మీకు రెండుమూడాపదలు వచ్చినవి. మిమ్మల్ని గురించిన వార్తలు నా కెప్పుడు పడితే అప్పుడే వస్తున్నవి. మిమ్మల్ని ఒకసారి రక్షకభటులు పట్టుకొని రాత్రిపూట చెఱలో ఉంచి ప్రొద్దుటనే వదలిపెట్టారు. ఆ వదలిపెట్టించింది నేనే."

నా కేమనటానికీ తోచలేదు. కృతజ్ఞత చెప్పనా? ఇంత చెహరాగల మనిషిని కాదని యెట్లా అనను. నేను—"అన్ని ఉద్యమాలు మీరే లేవదీస్తా రంటావు. అది యెలా?" బుంగన్న—"మీకు రుజువు కావలిస్తే ఇప్పుడే చూపిస్తా" అని ఒకనిని పిలిచాడు. పిలిచి "అయ్యగారితో నీసంగతి చెప్పు." అన్నాడు. అతను వెలా తెలాపోయి చూచాడు. బుంగన్న ఫర్వా లేదు చెప్పమన్నాడు. అతడు ఇలా చెప్పాడు—"నేను వంగదేశానికి వెళ్లి అక్కడ ఒక ఉద్యమాన్ని లేవదీయాలి. ఒక సభ జరుగుతూవున్న సమయంలో రక్షకభటులు పోయి సభను చెల్లాచెదరు చేయాలి. అక్కడనుంచి ఆ ఉద్యమం పెరుగుతుంది. బాగా పెరిగినతర్వాత ఆ ఉద్యమానికి మాసంఘం దోహదం యిస్తుంది. డబ్బు మేమిస్తాం. దానితో అటు రాచరికం అనుకొనేవాళ్లకి ఇటు ప్రజల్లో ఒక భాగానికి తగాదా పెరుగుతుంది." నేను—"దీనివల్ల మీ కేమి లాభం?" బుంగన్న — "అధికారులు మా చెప్పుచేతల్లో ఉంటారు. లేకపోతే రాజ్యంమీద మా అధికారం పోతుంది." నేను — "ఈ ఉద్యమాలన్నీ మీరు లేవదీసినవేనా?" బుంగన్న—"కొన్ని మేము లేవదీసినవి. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క దేశభాగంలో రక్షకభటులూ ఉద్యోగులూ మా అదుపు మీరిపోతుంటే మేమిట్లా చేస్తుంటాం."

ఇంతలో ఒకడు వచ్చాడు. బుంగన్నతో ఇల్లా విన్నవించుకొన్నాడు "బుంగన్నా! సంఘానికి డబ్బులేకపోతే నా తమ్ముడు దొంగతనం చేశాడు. వాడికి రెండేళ్లు ఖైదు వేశారు. సంఘం యేమీ చేయలేదు. వాడి కుటుంబం గడవటం ఎలా?" బుంగన్న—"క్రింది న్యాయస్థానంలో నేగదా! ఆ అధికారి క్రొత్తగా వచ్చాడు. ఈఊళ్లో సిఫారసులు పట్టలేదు. పైఊరునుంచి సిఫారసు వచ్చేదాకా ఆగలేదు. ఇంతకూ ఆ రక్షకభటాధికారి యీ పని చేశాడు. వాడూ క్రొత్తగా వచ్చాడు. వాడు మామూళ్లు తినేరకం కాదట. నేను చూస్తాను ఫర్వా లేదుపో. అంతగా కాకపోతే యీ రెండేళ్లు నెలకి ఇరవై రూపాయ లిప్పిస్తాను" అన్నాడు.

వా ళ్లిద్దరూ వెళ్లిపోయినారు. నేను — "బుంగన్నా! ఈ వ్యవహారం నాముందర యింత బహిరంగంగా చేస్తున్నావు. నే నెవరితో చెప్పనని నీ కెట్లా?" బుంగన్న—"చెపితే మాత్ర మేమి తప్పు? పైగా మీపని యింతటితో అయిపోయిందా? ఇహ ఇక్కడనుంచి మీ రెరిగిఉన్న వాళ్లకీ మీరుకూడా సిఫారసులు చేసిపెట్టాలి." నేను—"చాలా బాగుంది." బుంగన్న — "బాగా ఉండదా? బిచ్చగాళ్ల రాజ్యం ఇల్లాగే ఉంటుంది. రాజ్యం ఎప్పుడూ బిచ్చగాళ్లదే." నేను నవ్వాను.

బుంగన్న మళ్లీ అన్నాడు. "ఎందుకు నవ్వుతారు ? బిచ్చగాళ్లది రాజ్య మేమిటా? అనా! మీరు చదువులలో మర్మ మెల్ల చదువలేదు. ప్రపంచంలో ఇన్ని మతా లున్నవి. ఈ మతాలనిగురించి పోట్లాట లున్నవి. ఈ మతాలు నిర్మించింది యెవరు ? సన్యాసులు. సన్యాసులంటే బిచ్చగాళ్లు. పోతులూరి వీరబ్రహ్మం, వేమన్న వీ ళ్లెవరు? ఏసుక్రీస్తు, మహమ్మదు, శంకరుడు వీళ్లందరు ఎవరు? సన్యాసులు, బిచ్చగాళ్లు. బుద్ధుడున్నాడంటే తాను మతం మొదలుపెట్టే సరికి సన్యాసి కావలసివచ్చింది. మతవిషయకంగా లోకాన్ని పాలించేది సన్యాసులు. ఈ సన్యాసులు ఎట్లా చెప్పితే అట్లా సాగినవి పూర్వపు రాజ్యాలు. ఒక్క మతవిషయకంగానే కాదు, ఏవిధంగా చూచినా దేశాలను పాలించేవాళ్లు బిచ్చగాళ్లు. బిచ్చగాళ్లలో భేదా లుంటవి. పొరపాటు పడవద్దు. బిచ్చగాళ్లు మీలోనే ఉంటారు. వాళ్లు అధికారం చేస్తుంటారు, వాళ్లు మావాళ్లే. మీకు తెలియక అధికార్లను కొంటారు. వాళ్లందరూ మా మామూళ్లుతినేవాళ్లే. ఒకడు ప్రత్యక్షంగా తింటాడు, ఒకడు పరోక్షంగా తింటాడు. ఒకడు చేయిచాపుతాడు, ఒకడు దూరంగా నిలుచుండి భాగం తీసికొంటాడు. అసలు రహస్యం చెపుతా వినండి. లోకంలో మానవజాతి రెండే రకాలు. ఒకరకం సంసారులు; రెండవరకం బిచ్చగాళ్లు. అధికారు లనండి, సన్యాసు లనండి, మతగురువు లనండి, రాజకీయవేత్త లనండి, కవు లనండి, గాయకు లనండి వీళ్లందరూ రెండవరకం. వీళ్లు బిచ్చగాళ్లు. వీళ్లకి సంసారాలు చట్టుబండలూ అక్కరలేదు. వీళ్లకు కొట్టుకొ తినటం ప్రధానం. పెళ్లాం బిడ్డ లుంటే జంతుధర్మం. ఆత్మధర్మం బిచ్చగానితనం. ఎవడిజోలీ తన కక్కర లేదు. తా నేదో న్యాయంగా సంపాదించుకొంటాడు, తింటాడు. వాడు లోకాన్ని ఉద్ధరిస్తానని బయలుదేరడు. ఇట్లాంటివాడు సంసారి. లోకంలో యెక్కువమంది వీళ్లు. వాళ్లమీద బ్రతికేవాళ్లు బిచ్చగాళ్లు. బిచ్చగాణ్ణి అంటే ఎవరుపెట్తారు.? ఈసంసారులమాయకులు. వాళ్లులోకం. వాళ్ల నెవరూ ఉద్ధరించనక్కరలేదు. మిమ్మల్ని ఉద్ధరిస్తామంటే వాళ్లు నిజమేనని నమ్మతారు. ఆరీతిగా బిచ్చగాడు అధికారం సంపాదిస్తాడు. ఒకరక్షకభటుడున్నాడు. వాడికి ఉద్యోగం పోతేమేము రక్షించాలి. మేమెట్లారక్షిస్తాం? సంసారులను కొట్టి రక్షిస్తాం. ఈసంసారు లున్నారే వాళ్లొక చిత్రమైన సృష్టి. వాళ్లకు ఏజోలీ సొంతి అక్కరలేదు. నీవు వెళ్లి చెప్పితే వింటారు. నేను వెళ్లి చెప్పినా వింటారు. అసలు పుట్టుతూనే కొందరు బిచ్చగాళ్లు, కొందరు సంసారులు. మేము ఉద్యమాలు లేవదీస్తామంటే ఎవళ్లచేత లేవదీయిస్తాం? సంసారి కావటానికి చాలామంది పనికిరాకపోతారు, కొందరు. వాళ్లందరూ బిచ్చగా ళ్లవుతారు. వాళ్లని బిచ్చగాళ్లని మేము చేస్తాము. వాళ్లచేత ఉద్యమాలు లేవదీయిస్తాము. 'నీవు బిచ్చగాడివి కారా' అంటే కాడు. వాడికి, అధికారము, లోకోద్ధరణము అనే ఆశలు చూపిస్తాం. గతిలేనివాడు లోకోద్ధరణ చేయక యేం చేస్తాడు? మా బిచ్చగాళ్లలో చేరుతాడు. ఈలోకమంతా బిచ్చగాళ్లే యేలుతున్నారు. మాది గొప్ప సంస్థ. మాది గొప్ప సంఘం."

అతని పాండిత్యంముందర నా తెలివితేటలేమీ పనికిరాలేదు. నేను రాత్రి రెండుగంటలదాకా కూర్చొని తికమకప్రశ్నలు వేస్తూనే ఉన్నాను. అతడు ప్రతిదానికీ సమాధానం చెపుతూనే ఉన్నాడు. అన్ని సమాధానాలు ఆ మూలసిద్ధాంతంలోనుంచే వస్తున్నవి. ఎన్ని చెప్పినా అతడు వినడు. బిచ్చగాళ్లే రాజ్యం చేస్తున్నారంటాడు. లేకపోతే వాళ్ల కేమి పట్టింది? వాళ్ల సంసారాలు వాళ్లు చేసుకోరా ? శాంతంగా బ్రతుకలేరా! అంటాడు. - ఈఅధికారం వాళ్ల కెవరిచ్చారో చెప్పండి అంటాడు. నేను చెప్పాను. దానికి ఒప్పుకోడు. ఆ పథకం పెట్టింది మేమే. మిమ్మల్ని ఎన్నుకోమని చెప్పాం. వాళ్లెన్నుకొంటారు. మేము నలుగురం బిచ్చగాళ్లం. మాలో ఒకణ్ణి ఎన్నుకోక వాళ్లకి తప్పదు. నాకివ్వకపోతే మా గడ్డంవాడి కిస్తారు." నేను-"వా డెవ్వ"డన్నాను. బుంగన్న నవ్వి "క్రొత్తగా వచ్చాడు నాయకుడైనాడు. నాకన్న గొప్పవాణ్ణి అంటాడు."

సరే నేను వెళ్తా నన్నాను. నీ సిద్ధాంతం ఇంతేనంటావా! అన్నాను.

బుంగన్న గంభీరమైన ముఖంతో నిలుచున్నాడు. "కొందరికి ఎంత చెప్పినా తెలియదు. అందులో నీ వొకడవల్లే ఉన్నావు. మళ్లీ చెప్తున్నాను. సంసారులు - బిచ్చగాళ్లు రెండేరకాలు మానవులు. మతాలు, అధికారాలు, రాజ్యాలు సంసారులకు పట్టవు. వాళ్లు మేకలవంటివాళ్లు. అవన్నీ బిచ్చగాళ్లకు, మాకు పట్టుతవి. మేము తోడేళ్లవంటివాళ్లం. ఈ రెండురకాలుమనుష్యులు పుట్టటంతోటే అల్లా పుట్టుతారు."

అతని నిశ్చయం చూస్తే నేనేం మాట్లాడినా ఊరకొనేటట్లులేదు. నిజానికి, నేను అతను చెప్పిన మాటలు నమ్మలేదనటానికీ వీల్లేదు.